## అపొస్తులుడైన పౌలు

# ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక

ఈ పత్రిక అపొస్తులుడైన పౌలు తన విశ్వాసపాత్రుడైన ఫిలేమోనుకు వ్రాసెను. ఈ పత్రికలో ముఖ్యముగా ఫిలేమోను దగ్గర దాసునిగా వుండిన ఒనేసిము అను వ్యక్తిని క్షమించి, తిరిగి అతనిని పనిలో చేర్చుకొనవలసినదిగా పౌలు సిఫారస్ చేసాడు. ఈ పత్రిక రోమా చెరసాలలో క్రీ.శ 55-63 మధ్యకాలంలో వ్రాసియుండవచ్చును.

**ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక-అనుక్రమణిక**

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-7 | ఉపోద్ఘాతము |
| 1:8-21 | పారిపోయిన దాసుని గూర్చిపౌలు మనవి |
| 1:22-25 | ముగింపు మాట |

-----------------------------------------------------------------------

# ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక 1వ అధ్యాయము

### శుభవచనములు

క్రీస్తుయేసు ఖైదీయైన పౌలును, సహోదరుడైన తిమోతియును మా ప్రియుడును జతపనివాడునైన
ఫిలేమోనుకును, 2 మన సహోదరియైన అప్ఫియకును, తోడుయోధుడైన అర్ఖిప్పునకును, నీ యింట ఉన్న
సంఘమునకును శుభమని చెప్పి వ్రాయునది- 3 మన తండ్రియైన దేవునినుండియు ప్రభువైన
యేసుక్రీస్తునుండియు కృపయు సమాధానమును మీకు కలుగును గాక. 4 నీ ప్రేమను గూర్చియు, ప్రభువైన
యేసు ఎడలను సమస్త పరిశుద్ధుల యెడలను నీకు కలిగియున్న విశ్వాసమును గూర్చియు నేను విని,5 నా
ప్రార్థనలయందు నీ నిమిత్తము విజ్ఞాపనము చేయుచు, ఎల్లప్పుడు నా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు,
6 క్రీస్తును బట్టి మీయందున్న ప్రతి శ్రేష్ఠమైన వరము విషయమై నీవు అనుభవపూర్వముగా ఎరుగటవలన
ఇతరులు నీ విశ్వాసమందు పాలివారగుటకు అనునది కార్యకారి కావలయునని వేడుకొనుచున్నాను. 7
సహోదరుడా, పరిశుద్ధుల హృదయములు నీ మూలముగా విశ్రాంతి పొందినందున నీ ప్రేమనుబట్టి నాకు
విశేషమైన ఆనందమును ఆదరణ యు కలిగెను.

### పారిపోయిన దాసుని గూర్చి పౌలు మనవి

8 కావున యుక్తమైన దానిని గూర్చి నీ కాజ్ఞాపించుటకు క్రీస్తునందు నాకు బహు ధైర్యము
కలిగియున్నను, 9 వృద్ధుడను, ఇప్పుడు క్రీస్తుయేసు ఖైదీనైయున్న పౌలును నేను ప్రేమనుబట్టి వేడుకొనుట మరి
మంచిదనుకొని, 10 నా బంధకములలో నేను కనిన నా కుమారుడగు ఒనేసిము కోసరము నిన్ను
వేడుకొనుచున్నాను. 11 అతడు మునుపు నీకు నిష్ప్రయోజన మైనవాడే గాని, ఇప్పుడు నీకును నాకును

ప్రయోజకరమైన వాడాయెను. 12 నా ప్రాణము వంటివాడైన అతనిని నీయొద్దకు తిరిగి పంపియున్నాను. 13 నేను సువార్తకొరకు బంధకములో ఉండగా నీకు ప్రతిగా అతడు నాకు పరిచారముచేయు నిమిత్తము నాయొద్ద అతని ఉంచుకొన వలెనని యుంటిని గాని, 14 నీ ఉపకారము బలవంతము చేతనైననట్టు కాక స్వేచ్ఛా పూర్వకమైనదిగా ఉండవలెనని నీ సమ్మతిలేక ఏమియు చేయుటకు నాకిష్టములేదు. 15 అతడికమీదట దాసుడుగా ఉండక, దాసునికంటె ఎక్కువవాడుగాను, 16 ప్రియ సహోదరుడు గాను, విశేషముగా నాకును, శరీరవిషయమును ప్రభువు విషయమును మరి విశేషముగా నీకును, ప్రియ సహోదరుడుగాను, నీయొద్ద ఎల్లప్పుడు ఉండుటకే కాబోలు అతడు కొద్దికాలము నిన్ను ఎడబాసి యుండెను. 17 కాబట్టి నీవు నన్ను నీతో పాలివానిగా ఎంచినయెడల నన్ను చేర్చు కొన్నట్టు అతనిని చేర్చుకొనుము. 18 అతడు నీకు ఏ నష్టమైనను కలుగజేసినయెడలను, నీకు ఏమైన ఋణమున్న యెడలను, అది నా లెక్కలో చేర్చుము 19 పౌలను నేను నా స్వహస్తముతో ఈ మాట వ్రాయుచున్నాను, అది నేనే తీర్తును. అయినను నీ ఆత్మవిషయములో నీవే నాకు ఋణపడియున్నావని నేను చెప్పనేల? 20 అవును సహోదరుడా, ప్రభువునందు నీవలన నాకు ఆనందము కలుగనిమ్ము, క్రీస్తునందు నా హృదయమునకు విశ్రాంతి కలుగ జేయుము. 21 నేను చెప్పినదానికంటె నీవు ఎక్కువగా చేతువని యెరిగి నా మాట విందువని నమ్మి నీకు వ్రాయుచున్నాను.

**ముగింపు మాటలు**

22 అంతేకాదు, నీ ప్రార్థనల మూలముగా నేను నీకు అనుగ్రహింపబడుదునని నిరీక్షించుచున్నాను గనుక నా నిమిత్తము బస సిద్ధము చేయుము. 23 క్రీస్తుయేసునందు నాతోడి ఖైదీయైన ఎపఫ్రా 24 నా జతపనివారైన మార్కు, అరిస్తార్కు, దేమా, లూకా వందనములు చెప్పుచున్నారు. 25 మన ప్రభువైన యేసుక్రీస్తు కృప మీ ఆత్మకు తోడైయుండును గాక. ఆమేన్.